కొడుకుపై వేడి నూనె పోసిన తల్లి

6

- మద్యానికి బానిసై ఇంటిస్థలం అమ్మడంతో ఆగ్రహం
- గూడూరు మండలం చంద్రుగూడెంలో ఘటన

ఇందిరమ్మ రాజ్యంలో పేదల జీవితాల్లో వెలుగులు

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని ఇందిరమ్మ రాజ్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలవ్వడంతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో కొత్తగా 1500కార్డులు ఇవ్వడంతో పాటు 2500కార్డుల్లో కొత్తగా సభ్యులను చేర్చారని తద్వారా 4000మంది కుటుంబాలకు మేలు జరిగిందని చెప్పారు. రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి వ్యక్తికి నెలకు 6కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అనంతరం కొత్త రేషన్‌కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లాఅధ్యక్షుడు బోడ రవినాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్‌నాయక్, బెల్లంకొండ శ్రీనివాస్, నలమాస వెంకన్న, నారోజు సత్యమనోరమ, చెన్నూరు విజయలక్ష్మి, స్వర్ణలత పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తారు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బయ్యారం, గూడూరు, కొత్తగూడ, మరిపెడ మండలాల్లో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. పలుమండలాల్లో ముసురు అలుముకుంది. చిన్నగూడూరు, దంతాలపల్లి, డోర్నకల్, గార్ల, మహబూబాబాద్, ఇనుగుర్తి, కురవి మండలాల్లో చిరుజల్లులు కురిసాయి. కాగా, సోమవారం రాత్రినుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు గూడూరులో భారీ వర్షం కురిసింది. గార్ల, కొత్తగూడ, మహబూబాబాద్, చిన్నగూడూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. కొత్తగూడలో 24.4, గంగారంలో 13.2, బయ్యారంలో 9.2, గార్లలో 23.6, డోర్నకల్‌లో 16.4, కురవిలో 11.6, మహ బూబాబాద్‌లో 22.6, గూడూరులో 75.2, కేసముద్రంలో 12.6, నెల్లికుదురులో 11.0, నర్సింహులపేటలో 9.0, చిన్నగూడూరులో 20.8, మరిపెడలో 10.4, దంతాలపల్లిలో 8.4, తొర్రూరులో 9.6, పెద్దవంగరలో 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 284.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 17.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.


గాల్లో దీపం.. 'గ్రామీణ' వైద్యం

అస్తవ్యస్తంగా పల్లె దవాఖానాలు

- సమయ పాలన పాటించని ఎంఎల్‌హెచ్‌పీలు
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- కానరాని వైద్య శిబిరాలు.. ఇబ్బంది పడుతున్న రోగులు
- జిల్లాలో 139 పల్లె ఆస్పత్రులు



పర్వతగిరి పల్లె ఆస్పత్రిలో ఉన్న ఒకే ఒక్క ఆశావర్కర్



తొర్రూరు మండలం అరిపిరాలలో పల్లెదవాఖానాలో ఖాళీగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ కుర్చీ

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందని ద్రాక్షలా మారింది. జిల్లా వ్యాప్తంగా పల్లె దవాఖానాలు అస్తవ్యస్తంగా మారాయి. పల్లె దవాఖానాల్లో విధులు నిర్వహించే మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ), కొంతమంది వైద్య సిబ్బంది సమయానికి రారు.. వచ్చినా ఉండరు అనే ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (ఏఏఎం) పథకంలో బాగంగా గ్రామాల్లో వైద్య సేవల విస్తరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 2022లో జిల్లా వ్యాప్తంగా ఉన్న 139 పల్లె దవాఖానలకు ఎంఎల్‌హెచ్‌పీల పోస్టులను కేటాయించారు. ఒక్కో పల్లె దవాఖానకు ఒకరు ఎంఎల్‌హెచ్‌పీ చొప్పున 129 మందిని పీడీఎంవో, బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతలు ఉన్న వారిని నియమించారు. వీటిల్లో 119 పోస్టులు పిలప్ చేయగా, 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా జిల్లాలోని కొన్ని పల్లె దవాఖానల్లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగులు స్థానికంగా ఉండక పోవడం, సమయ పాలన పాటించకపోవడంతో ఆస్పత్రికి వచ్చే జ్వర బాధితులు, రోగులకు నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ లు ఖమ్మం, వరంగల్ నగరాల నుంచి రోజు అప్ అండ్ డౌన్ చేస్తుండడంతో క్షేత్రస్థాయిలో వైద్యం అందడం లేదు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పర్యవేక్షించి గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందేలాచూడాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాల అమలు, పల్లె ఆస్పత్రి అనుబంధ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రోగులకు 105 రకాల మందులను అందుబాటులో ఉంచి వైద్యం అందించాలి. చిన్న పిల్లలకు బేసిక్ వైద్యం అందిస్తూనే క్రిటికల్ సమయంలో స్థానిక పీహెచ్‌సీకి రెఫర్ చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలుకు నోచుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



సమయానికి రారు.. వచ్చినా ఉండరు..

ఎంఎల్‌హెచ్‌పీలు విధులపట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తూ సమయానికి రారు. వచ్చినా అందుబాటులో ఉండరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్త ంగా పలు పల్లె దవాఖానల పరిస్థితి ఇలానే ఉన్నట్లు సమాచారం. విధులకు హాజరైనా మధ్యాహ్నం 12 గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన పలువురు కిందిస్థాయిలో పనిచేసే సిబ్బందికి హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. గత సంవత్సరం తొర్రూరు మండలంలోని ఓ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ ఎలాంటి సెలవు పెట్టకుండా యూఎస్ఏ(ఇతర దేశం)కి వెళ్లి వచ్చారంటే ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగుల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి దోమల తీవ్రత పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతూ వైద్యం కోసం పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా వైద్య సిబ్బంది అలసత్వంతో లక్ష్యం పక్కదారి పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, మండలాల్లో మెడికల్ ఆఫీసర్ల క్షేత్రస్థాయి పర్యటనలతోనే సిబ్బంది పనితీరులో మార్పు వస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ఆస్పత్రుల్లో ఆశా వర్కర్లే దిక్కు..

పల్లె దావాఖానాలకు ఆశావర్కర్లే దిక్కవుతున్నారు. గ్రామాల్లో వైద్య సేవలను విస్తరించాలనే ఉద్దేశ్యంతో జనాభా ప్రతిపాదికన గ్రామాలను యూనిట్‌గా చేసి పల్లె దవఖానలను ఏర్పాటు చేశారు. పల్లె దవాఖానలకు ఎంఎల్‌హెచ్‌పీలను ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చి ఇద్దరు ఏఎన్ఎంలు, నాలుగురు ఆశావర్కర్లను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించా లనేది ప్రభుత్వ లక్ష్యం. కానీ ఎంఎల్‌హెచ్‌పీల నిర్లక్ష్యంతో ఆశా వర్కర్లే పల్లె దవాఖానలకు పెద్ద దిక్కుగా మారారు. ఏ సమయంలో పల్లె దవాఖానలకు వెళ్లినా ఆశా వర్కర్లు, కొందరు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండడం ఎంఎల్ హెచ్‌పీల పనితీరుకు నిదర్శనం.



సమయపాలన పాటించకుంటే చర్యలే..

భూక్య రవి రాథోడ్, డీఎంహెచ్‌వో

వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రతీ ఉద్యోగి సమయపాలన పాటించాలి. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. త్వరలో చర్యలు తీసుకుంటాం.

టీచర్ల సమస్యల పరిష్కారానికి

ఎస్టీయూ పోరాటం



మాట్లాడుతున్న సుధాకరాచారి

తొర్రూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): టీచర్ల సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి అన్నారు. సోమవారం తొర్రూరుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడారు. సీపీఎస్ రద్దు, నగదు రహిత వైద్య సేవలు, 317 జీవో సమస్యల సాధనకు మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ అంశాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, 010 సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు పాఠశాలల సమస్యలకు అంకితమై సమరశీల ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్‌రెడ్డి, చంద్రప్రకాశ్, చంద్రమౌళి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పథకాల అమలులో కలెక్టర్లే కీలకం

వీసీలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం, లక్ష్మణ్, సురేఖ



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అధికారులు

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించి సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. హైదరా బాద్ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూ భారతి, రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజనం, మౌళిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కోడిగుడ్ల టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రంలో బుధవారంతో 200కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా 97బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. భూ భారతిలో నమోదైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వనమహోత్సవంలో క్షేత్రస్థాయిలో మొక్కలు నాటాలన్నారు. ఈవీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూ దనరాజు, రవీందర్‌రెడ్డి, నర్సింహస్వామి, ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్, కృష్ణవేణి, డాక్టర్ రవిరాథోడ్,శ్రీనివాస్, శిరీష పాల్గొన్నారు.

కొండంత చేశాం... గోరంత చెప్పుకోలేక పోతున్నాం

- ఏడాదిన్నరలో సాధించిన ప్రగతిపై విస్తృత ప్రచారం కల్పించాలి
- వీసీలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

8

మోడుబారుతున్న మొక్కజొన్న

- తల్లడిల్లుతున్న అన్నదాత
- బయ్యారం మండలం గంధంపల్లిలో ఘటన



మొక్కజొన్న పంట చనిపోవడంతో విలపిస్తున్న రైతు నాగమణి

బయ్యారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఆశలతో మొక్క సాగు చేస్తున్న రైతుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కళ్ల ఎదుటే మొక్కజొన్నలు మోడుబారుతుంటే మొక్కలను తీసివేయడం తప్ప ఏమి చేయలేని నిస్సాహాయస్థితి.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆ రైతు కుటుంబం విలపిస్తోంది. బయ్యారం మండలం గంధంపల్లి గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గంధంపల్లి గ్రామానికి చెందిన నాయిని వెంకన్న నాగమణి రైతు దంపతులు సంతులాల్ పోడు తండా సమీపంలో ఏడెకరాల భూమి కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నెల రోజుల క్రితం మొక్కజొన్న విత్తనాలు విత్తారు. అనంతరం పైరు ఎదగకపోవడం, వేర్లు మాడిపోయి మొక్కలు మోడుబారుతుండడంతో వెంకన్న దంపతులకు తొలుత ఏం చేయాలో అర్థం కాలేదు. ఈ క్రమంలోనే విత్తనాలు తెచ్చిన షాపు వద్దకు వెళ్లి విషయాన్ని వివరించగా.. సంబంధిత యజమాని చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ విత్తనాలు విత్తమని కొన్ని విత్తన ప్యాకెట్లు ఇచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ తరుచుగా వేరే మొక్కలు కూడా చస్తుండడంతో అసలు నకిలీ విత్తనాల వల్లే తమ పంట చస్తుందా.. అన్న సందేహాలు ఆ రైతు కుటుంబాన్ని వెంటాడుతోంది. తమను మోసం చేసి నకిలీ విత్తనాలు అంటగంటారని, అందుకే తమ పంట చనిపోతుందని, మొక్కజొన్న పైరు వేర్లు మాడిపోయి కుళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చర్యలు తీసుకొని తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని విలపిస్తున్నారు. ఈ విషయమై ఏవో రాంజీనాయక్‌ను వివరణ కోరగా.. వెంకన్న చేనుకు సంబంధించిన మొక్కజొన్న పైరు మొక్కలు చనిపోతున్న వాస్తవమేనన్నారు. పంటను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని వారి ఆదేశాలనుసారం తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి : కలెక్టర్

మహబూబాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకుని ఉపాధిపొందాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ చాంబర్‌లో జిల్లాపెట్టుబడుల ప్రోత్సహక కమిటీ (డీఐపీసీ) సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ టీ-ప్రైడ్ స్కీం ద్వార జిల్లాలో గిరిజనులు 24 మందికి రూ.82.40 లక్షలు, దళితులకు ఇరువురికి రూ.7.28 లక్షలు మొత్తంగా రూ.89.67 లక్షల నిధుల కేటాయి ంపుకోసం కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 26 మంది లబ్ధిదారులకు సబ్సిడీ రాయితీ మంజూరు చేయడం జరిగిందన్నారు. తెలంగా ణ ఐపాస్ ద్వార 12 యూనిట్లకు రూ.24.29 కోట్ల పెట్టుబడితో అనుమతులు పొందాయని, కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూరు మండలాల్లో రైస్ మిల్లులను స్థాపించేందుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. పరిశ్రమల శాఖ ద్వార యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణను ప్రారంభించడం జరిగిందని, ఈ పథకం అమలు కోసం జిల్లా స్థాయి కమిటీని నియమించామన్నారు. అనంతరం డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ పథకం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు మధుసూదనరాజు, శ్రీమన్నారాయణ, దేశీరాం, శ్రీనివాసరావు, జైపాల్‌రెడ్డి,యాదగిరి, రజిత, సాయిరాం,వెంకటరమణ,సుభాష్, మహేష్ పాల్గొన్నారు.



డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌పథకంపోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

యాంత్రీకరణపై అవగాహన

పెంచుకోవాలి

- మానుకోట డీఏవో అజ్మీర శ్రీనివాసరావు

6

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

- సొత్తును కొనుగోలు చేసిన వ్యక్తులు సైతం..
- రూ. 3 లక్షల విలువ గల రెండు ఆటోలు స్వాధీనం

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆటోలు అపహరించుకపోతున్న అంతరాష్ట్ర దొంగతో పాటు అతడి వద్ద దొంగ సొత్తు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులను మహబూబాబాద్ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. మహబూబాబాద్ టౌన్ సీఐ జి.మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టౌన్ ఎస్సై ఏ అశోక్ సిబ్బందితో కలిసి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులను చూసి అనుమానంగా ఒక వ్యక్తి పారిపోతున్న క్రమంలో వెంబడించి పట్టుకొని విచారించారు. కురవి మండలం కొత్తూరు గ్రామ పరిధిలోని తాట్యాతండాకు చెందిన బాదావత్ గాంధీగా గుర్తించామన్నారు. గాంధీ ఈ నెల 16న మహబూబాబాద్ పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ముందు పార్కింగ్ చేసిన ఆటోను అపహరించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్‌కు చెందిన బొమ్మిడి సతీష్‌కు విక్రయించినట్లు తెలిపారు. అదే రోజు రాత్రి మానుకోటకు చేరుకున్నారు. మరుసటిరోజు 17న తొర్రూరు బస్టాండ్ దగ్గర ఒక ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోను దొంగిలించుకొని భద్రాద్రి కొత్తగూడెం భూర్గంపాడుకు చెందిన సతీష్ అనుమతితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కుక్కునూరు మండలం వేలూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ నాగేష్‌కు తక్కువ ధరకు విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగతో పాటు దొంగ సొత్తును కొనుగోలు చేసిన వారితో పాటు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. కాగా దారావత్ గాంధీపై గతంలో మేడిపల్లి, ఘట్‌కేసర్, ఉప్పల్, కీసర ప్రాంతాల్లో చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు.

మానుకోటలో నాలుగో నంబర్ ప్లాట్ ఫాం నిర్మించాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో నాలుగవ నెంబరు ప్లాట్ ఫారంను నిర్మించాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌ను మంగళవారం సీపీఐ ప్రతినిధి బృందం సందర్శించింది. కొత్త బజారు వైపు ప్రయాణికులు పడుతున్న ఇబ్బం దులను గుర్తించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ మానుకోట రైల్వే స్టేషన్‌లో మూడవ లైన్‌కు కొత్త బజారు వైపు ప్లాట్ ఫారం నిర్మించక పోవడంతో మూడవ లైన్‌లో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నాలుగవ నెంబరు ప్లాట్ ఫారం నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు రైల్వే స్టేషన్ సమీపంలోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, శ్యాంప్రసాద్, రమేష్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శిస్తున్న సీపీఐ ప్రతినిధి బృందం



కేసముద్రంలో రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పదేళ్ల తర్వాత రేషన్‌కార్డులు మంజూరు

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూశారని, సీఎం రేవంత్ సారథ్యంలోని ప్రజాప్రభుత్వంలో కొత్త రేషన్‌కార్డులను పొందుతున్నారని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. మండలంలోని 32 మంది రేషన్‌డీలర్ల పరిధిలో 4,839 కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. కేసముద్రం రైతువేదికలో మంగళవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వంలో రేషన్‌షాపుల్లో ఇచ్చిన దొడ్డు బియ్యం తినలేక ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తోందన్నారు. 200 యూనిట్ల ఉచిత కరెంటును రేషన్ కార్డు దారులు పొందుతున్నారని, ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో కాంత్రి, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, సొసైటీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్లు వోలం రమేష్, చింతకుంట్ల యాదగిరి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలి

- మహబూబాబాద్ డీఏవో అజ్మీరా శ్రీనివాసరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలు, యాంత్రీకరణపై అవగాహన పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి డీఏవో అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్ మండలం జంగిలిగొండలో మంగళవారం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయశాఖ,జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన వంగడాలనుఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. మల్యాల కేవీకే శాస్త్రవేత్త క్రాంతికుమార్ మాట్లాడారు. తక్కువ మోతాదులో యూరియా వాడాలని, వరిలో స్వల్పకాలిక సన్న రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అశ్విని, సుహాసిని, ఏవో ఎస్.తిరుపతిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు. అభ్యుదయ రైతు పురుషోత్తంరెడ్డిని అయిల్‌పామ్ సాగు చేసినందుకు ఆయనను సన్మానించార కార్యక్రమంలో ఏఈవో షహీనా, కార్యదర్శి నగేష్, అయిల్‌ఫెడ్ మానిటరింగ్ అధికారి కరుణాకర్, శ్రీకాంత్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో జైలు శిక్ష, జరిమానా

నర్సింహులపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నర్సింహులపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మానికి చెందిన బానోతు నవీన్‌పై 2021లో మండలంలో పోక్సో కేసు నమోదు కాగా, మహబుబాబాద్ కోర్టు మంగళవారం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.17వేల జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

కొడుకుపై వేడి నూనె పోసిన తల్లి

» మద్యానికి బానిసై ఇంటిస్థలం అమ్మడంతో ఆగ్రహం
» గూడూరు మండలం చంద్రుగూడెంలో ఘటన

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇంటి స్థలం అమ్ముకున్న కొడుకుపై ఆగ్రహంతో కన్నతల్లి సలసల కాగే వేడినూనె పోసిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలం చంద్రుగూడెం గ్రామానికి చెందిన పాడాల మల్లయ్య - అనసూర్య దంపతులకు నలుగురు కూతుళ్లు కావడంతో శ్రీనివాస్‌ను దత్తత తీసుకున్నారు. నలుగురు కూతుళ్లకు వివాహం చేసిన అనంతరం దత్తత కుమారుడు పాడాల శ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా ముకుందాపురం గ్రామానికి చెందిన సరితతో పెళ్లి చేశారు. వారికి ఇద్దరు కుమారైలు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ మద్యానికి బానిసై ఇంటికి వచ్చి తరుచూ భార్య సరితతో ఘర్షణ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో విసుగు చెందిన భార్య సరిత మూడేళ్ల క్రితం ఇద్దరు పిల్లలతో హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటుంది. చంద్రుగూడెంలో వృద్ధురాలు తల్లి అనసూర్యతో ఉంటున్న శ్రీనివాస్ ఇటీవల ఎవరికి తెలియకుండా రెండు గుంటల ఇంటిస్థలం విక్రయించాడు. దీంతో ఆగ్రహించిన తల్లి అనసూర్య మద్యం మత్తులో ఉన్న కుమారుడు శ్రీనివాస్‌పై కాగే నూనె పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు సీఐ సూర్యప్రకాష్ తెలిపారు. కాగా మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిమురారి బాధితుడి నుంచి వాంగ్మూలం రికార్డు చేసుకున్నారు.



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

» పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క
» ములుగులో జిల్లా గ్రంథాలయం ప్రారంభం

ములుగుటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ములుగు జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనాన్ని మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ములుగు జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో డీసీసీ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు గ్రంథాలయాలను సరసతీ నిలయాలుగా భావించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగార్థులకు లైబ్రరీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ములుగు గ్రంథాలయ భవనాన్ని రూ. 25 లక్షలతో నిర్మించామని తెలిపారు. గ్రంథాలయం ఆవరణలో ఆహ్లాదకర పుస్తక పఠనం కోసం రూ. 10లక్షలతో పలు రకాల చెట్లు నాటించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.అలివేలు, మునిసిపల్ కమిషనర్ సంపత్, డీసీవో సర్దార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన డీసీసీ బ్యాంక్ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు డీసీసీ బ్యాంక్ సహకారం ఉంటుందన్నారు. దీని ద్వారా రైతులకు వ్యవసాయ, కర్షక మిత్ర, విద్యా రుణాలు, బంగారు రుణాలను అందిస్తారన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రైతుల రుణాలను మాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని కొనియాడారు. సన్నవడ్లు పండించిన రైతులకు రూ. 500 బోనస్‌పాటు రైతు భరోసాను అందిస్తున్నమని తెలిపారు. అనంతరం ఆయా రుణాలకు సంబంధించిన చెక్కులను రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌తో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీసీవో సర్దార్‌సింగ్, జిల్లా గంథ్రాలయ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, పీఏసీఎస్ చైర్మన్ కూనూర్ అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ములుగులో జిల్లా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

తహసీల్దార్‌పై మంత్రి ఆగ్రహం

మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో మంత్రి సీతక్క రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గిరిజన భవన్‌లో ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ జగదీశ్వర్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు లేకుండా రేషన్ కార్డులను ఎవరికి ఇస్తారని ప్రశ్నించారు. లబ్ధిదారులందరినీ ఎందుకు పిలువలేదని మందలించారు.

'దేవాదుల' సెంట్రల్ నోడల్ అధికారిగా ఆశిష్ సక్సేనా

హనుమకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం సెంట్రల్ నోడల్ అధికారిగా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రెటరీ ఎస్‌హెచ్ ఆశిష్ సక్సేనా నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పదంలాల్ నేగి స్థానంలో ఆయన నియమితులయ్యారు. సక్సేనా హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని ఈ ప్రాజెక్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై), జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పరిధిలో ఉన్న దేవాదుల ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం అందుతున్న సాగునీటిని మరింత సమర్థవంతంగా ఉపయోగించేందుకు తీసుకోవలసిన చర్యలను సెంట్రల్ నోడల్ అధికారిగా సక్సెనా కేంద్రానికి సూచిస్తారు. ప్రతీ నీటిబొట్టుతో ఎక్కువ పంటను ఉత్పత్తి చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. అలాగే జల్ జీవన్ మిషన్ కిందకు కూడా తీసుకువచ్చిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, ప్రాజెక్టు రైతులకు మరింత ఎక్కువ ప్రయోజనం కలిగించేట్టు చూడడం వంటి మౌలిక విధులను నిర్వర్తిస్తారు. దేవాదుల ప్రాజెక్టు హనుమకొండ, వరంగల్, కరీంనగర్, ములు గు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 2.48 లక్షల హెక్టార్లకు సాగునీరందించడానికి ఉద్దేశించింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.13580.63కోట్లు. ఈ ప్రాజెక్టు వాస్తవానికి 2025 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినా 2027 మార్చి నాటికి పూర్తవుతుందని అంచనా. ప్రాజెక్టు మిగిలిపో యిన పనుల సత్వర పూర్తికి సెంట్రల్ నోడల్ ఆఫీసర్ మార్గదర్శనం చేస్తారు.

ప్రతిభ చాటిన మానుకోట పోలీసులు

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జోన్ పరిధిలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లాకు చెందిన పది మంది పోలీసులు ప్రతిభ చాటి 17 పతకాలు సాధించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మంగళవారం వారిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. భద్రాద్రి జోన్ డ్యూటీ మీట్‌లో మరిపెడకు చెందిన ఎమ్డీ అబ్దుల్‌ఖదీర్ కంప్యూటర్ అవర్నెస్ ప్రోగ్రాంలో గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో గౌరవ మర్యాదలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ప్రతాప్, తిరుపతి, సీఐ చంద్రమౌళి, ఉపేందర్, సర్వేష్, ఆర్ఐ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మానుకోట జిల్లాకు దాశరథి పేరు పెట్టాలి



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ రచయితల వేదిక బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాకు దాశరథి కృష్ణమాచార్యుల పేరు పెట్టాలని తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు గుర్రపు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నా తెలంగాణ కోటి రతనాల వీణ గొప్ప కవితా వాక్యం అని కారాగారం మీద బొగ్గుముక్కతో రాసిన ఈ నినాదం ఎన్ని దశాబ్దాలు గడిచిన ప్రచుర్యంలో ఉందని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కవి, రచయిత కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాణాల వీరయ్య, రేణిగుంట్ల లక్ష్మీకాంతారావు, బొడ్డుపల్లి వీరస్వామి, రవీందర్, గందసిరి వేణు, సోమ నాగన్న, పరికిపండ్ల అశోక్, శ్యామ్‌గౌడ్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాశరథి జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్‌కుమార్, మసూద్ అహ్మద్, సాంబశివరావు, వినోద్‌కుమార్, బి. శ్రీనివాస్, అన్నపూర్ణ, రాజశేఖర్, కాశీం, హతిరాం, సుమన్, ఉపేందర్, రామన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట గురుకులంలో విద్యుత్ షాక్

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు

మహబూబాబాద్ క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రం పత్తిపాక రోడ్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం జరగడంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణ శివారు పత్తిపాకకు వెళ్లే దారిలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహం భవనంపైన పలువురు విద్యార్థులు స్టడీ అవర్‌లో చదువుకుంటున్నారు భవనం ఒక్కసారిగా ఎర్త్‌కు గురికావడంతో ఈ క్రమంలో ఒక్కసారిగా ఎనిమిదో తరగతి విద్యనభ్యసిస్తున్న సాయిచరణ్, జి హేమంత్, టి. సిద్దార్థలు విద్యుదాఘాతానికి గురయ్యారు. తక్షణమే అప్రమత్తమైన ఆశ్రమ పాఠశాల సిబ్బంది ముగ్గురు విద్యార్థులను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం ఏమీ లేదని ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ రాంరెడ్డి తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7820	5300
మక్కలు	2355	1521
కందులు	5966	3022
పెసళ్లు	7002	3022
పల్లికాయ (సూక)	5800	3450
పల్లికాయ (పచ్చిది)	4800	1575
పసుపు (కాడి)	10299	9534
పసుపు (గోల)	10000	9700
తేజ మిర్చి	8000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341 ఏసీ	13000	7000
దీపిక	9000	8000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మరిపెడ మీదుగా త్వరలో రెండు ఫోర్‌లేన్ రోడ్లు



మరిపెడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మీదుగా త్వరలో రెండు ఫోర్‌లేన్ రోడ్లు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశ వ్యాప్తంగా 10వేల కిలోమీటర్ల డబుల్ రోడ్లను ఫోర్ లేన్ రోడ్లుగా విస్తరించే ప్రక్రియను ఇటీవల కేంద్ర మంత్రి గడ్కరి ప్రకటించారు. అందులో రాష్ట్రంలోని 15 రోడ్లను ఫోర్‌లేన్ రోడ్లుగా విస్తరించనున్నారు. మరిపెడ మీదుగా వరంగల్ నుంచి ఖమ్మం వెళ్లే 653 హైవే 119 కిలోమీటర్లు, నకిరేకల్ నుంచి మేడారం వరకు వెళ్లే 365 జాతీయ రహదారి సైతం కేంద్రం ప్రకటించిన జాబితాలో ఉండడం ఈ ప్రాంత ప్రజలను ఆనందానికి గురిచేసింది. ఈ రెండు రోడ్లను ఫోర్‌లేన్‌గా మార్చే కార్యచరణను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో మరిపెడ ప్రాంత ప్రజలు మురిసిపోతున్నారు. డబుల్ రోడ్లతోనే భూముల ధరలకు డిమాండ్ రావడంతో ఇప్పటికీ సంతోషంగా ఉన్న ఈ ప్రాంత రైతులు తమ భూములు, ప్లాట్లకు మరింత డిమాండ్ వస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోర్‌లేన్ రోడ్ల కోసం 2021లోనే సర్వే జరిగింది. మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఫ్లై ఓవర్ నిర్మిస్తారని లేక బైపాస్ లైన్ వేస్తారని చర్చ సాగుతుంది. ఏదీ ఏమైనా మరిపెడ ప్రాంత ప్రజలకు మహర్దశ పట్టనున్నది.

శాశ్వత ఆధార్ కేంద్రాలేవి ?

» ఐదు మండలాల్లో కానరాని సెంటర్లు
» అప్‌డేట్‌కు తప్పని తిప్పలు
» అవస్థలు పడుతున్న ప్రజలు

మహదేవపూర్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కాటారం సబ్‌డివిజన్ పరిధిలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు మండలాల్లో ఎక్కడ వాటి జాడే కనపడటం లేదు. కనీసం అప్‌డేట్ సెంటర్లు కూడా అందుబాటు లేవు. గతంలో ఉన్న శాశ్వత నమోదు కేంద్రాలు తెరుచుకోవడం లేదు. దీంతో మహదేవపూర్, కాటారం, పలిమెల, మహముత్తారం, పలిమెల మండలాల ప్రజలు అప్‌డేట్ కోసం నానా పాట్లు పడుతున్నారు. ఆధార్‌లో ఫోన్ నెంబర్, ఫొటో, బయోమెట్రిక్, అడ్రస్ అప్‌డేట్లతో పాటు ప్రతి పదేండ్లకు ఒకసారి చేసుకునే డాక్యుమెంట్ అప్‌డేట్ కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

ఉన్నవాటిని తీసేయ్యక.. కొత్తవాటికి అనుమతించక..

గతంలో ఐదు మండలాల పరిధిలో ప్రతి మండలంలోని ఒక మీ -సేవ కేంద్రంలో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాల్లోనే కొత్త ఆధార్ కార్డుల నమోదుతో పాటు ఉన్న ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసేందుకు అవకాశం ఉండేది. కాని కొత్త ఆధార్ నమోదు, ఇదివరకే ఉన్న ఆధార్‌కార్డుల అప్‌డేట్లలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో ఆ కేంద్రాలను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించేలా ఆదేశాలు వచ్చాయి. దీంతో కొన్నేండ్లుగా తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఈ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సుమారు సంవత్సరం కాలం అవి కూడా పని చేయడం లేదు. కొన్ని కేంద్రాల్లో ఆధార్ ఆపరేటర్లు చేసిన తప్పులకు జరిమానా విధించడంతో పాటు సస్పెండ్ చేశారు. మరికొన్ని కేంద్రాల్లో భారీగా జరిమానాలు విధించడంతో ఆపరేటర్లు సైతం నిర్వహించేందుకు ముందుకు రావడం లేదు. అప్పటి నుంచి ఉన్న కేంద్రాలను పునరుద్ధరించకపోగా కొత్త కేంద్రాలను కేటాయించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమయానికి అప్‌డేట్ చేయక బ్లాక్

మండలానికి కనీసం ఒక్క ఆధార్ కేంద్రం లేకపోవడంతో అప్‌డేట్ ప్రక్రియలో సమస్య నెలకొంది. పిల్లలకు బాల ఆధార్ నుంచి మెయిన్ ఆధార్‌కు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఐదు సంవత్సరాలలోపు ఆధార్ పొందిన పిల్లలు ఐదేళ్లకు ఒకసారి పదేళ్లకొకసారి, మళ్లీ పదిహేను ఏళ్లకొకసారి మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఈ అప్‌డేట్ ఉచితమే అయినా కేంద్రాలు అందుబాటులో లేక అవి జరగడం లేదు. బయోమెట్రిక్ వచ్చి ఏడాది దాటినా అప్‌డేట్ చేయకపోతుండడంతో ఆధార్ కార్డులు బ్లాక్ అవుతున్నాయి. మళ్లీ వాటిని పునరుద్ధరించాలంటే హైదరాబాద్‌లో ఉన్న యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. అయితే జిల్లా కేంద్రంలో ఉన్న ఆధార్ కేంద్రానికి వెళ్లాలంటేనే ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. ఏకంగా హైదరాబాద్ అంటే తమ పరిస్థితి ఏంటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన సంవత్సరంలో ఐదు మండలాల్లో సుమారు వందకు పైగా ఆధార్ కార్డులు బ్లాక్ అయినట్లు తెలిసింది. ఆధార్ కార్డులు ఆగిపోతే రేషన్ బియ్యంతో పాటు బ్యాంకింగ్, రైతు భరోసా, పెన్షన్ వంటి మరెన్నో ప్రభుత్వ పథకాలను కోల్పోయే అవకాశం ఉంది. కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయడమో లేదా ఉన్న కేంద్రాలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏ అప్‌డేట్‌కైనా జిల్లా కేంద్రానికే పరుగు

కొత్త ఆధార్ కార్డుతో పాటు ఇదివరకే ఉన్న ఆధార్ కార్డులో అప్‌డేట్ చేసుకోవాలన్న జిల్లా కేంద్రానికే పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఆధార్‌లో ఫోన్ నెంబర్‌తో పాటు మెయిల్ ఐడీ, చిరునామా, కేరాఫ్, పుట్టిన తేదీ, జెండర్, పేరును అప్‌డేట్ చేసేందుకు అవకాశం ఉంది. ఇందులో ప్రధానంగా ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, చిరునామాలో మార్పు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోనూ పరిమిత సంఖ్యలోనే ఆధార్ సెంటర్లు ఉండటంతో తీవ్ర రద్దీ ఉంటుంది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు టోకెన్ పద్ధతిలో ఆధార్ అప్‌డేట్లు చేస్తున్నారు. పలిమెల వంటి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు టోకెన్ దొరకక వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్క అప్‌డేట్ కోసం మూడు నాలుగు సార్లు వెళ్లాల్సి రావడంపై వాపోతున్నారు.

క్రేజీ.. జియాలజీ


పీజీ కోర్సు పూర్తి చేసినవారికి ఉజ్వల భవిష్యత్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విస్తృత ఉద్యోగావకాశాలు
- కేయూలో అడ్మిషన్లకు పెరుగుతున్న డిమాండ్
- ఈ యేడాది నుంచి ప్రవేశాలకు అర్హతల సడలింపు

కేయూ క్యాంపస్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సైన్స్ విభాగంలో విభిన్నమైన కోర్సు భూగర్భ (జియాలజీ)శాస్త్రం. దీనికి ఏటా డిమాండ్ పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విరివిగా ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటంతో యువత ఎంఎస్సీ జియాలజీ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు. కేయూలో 1989లో 12 సీట్లతో ఈ కోర్సును ప్రారంభించారు. విద్యార్థుల డిమాండ్ దృష్ట్యా ప్రస్తుతం 40 సీట్లకు పెంచారు. యేటా ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు కేయూ జియాలజీ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నాయి. విదేశీ సంస్థలు సంస్థలు సైతం జియాలజీ విద్యార్థులను భారీ ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి.

జియాలజీ విభిన్నం..

సైన్స్ కోర్సులన్నింటిలో జియాలజీ కోర్సు విభిన్నం. భూమి పుట్టుక నుంచి ఉపరితలంపై నిత్యం చోటు చేసుకునే అంశాలను ఈ కోర్సు అధ్యయనం చేస్తుంది. భూమార్పులకు కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తుంది. భూమిలో ఉండే పెట్రోల్, గ్యాస్‌తో పాటు బంగారం, రత్నాలు, వజ్రాలు, బొగ్గు ఖనిజాలను పసిగడుతుంది. అంతేగాకుండా సునామీ, భూకంపాలు, అగ్ని పర్వతాల పేలుడు లాంటి ప్రకృతి వైపరీత్యాలను అధ్యయనం చేస్తుంది. సాఫ్ట్‌వేర్ రంగంలోనూ జియాలజీ విభాగాలు తోడ్పడుతున్నాయి.



కేయూలో ఎంఎస్సీ జియాలజీ విభాగం

జియాలజీ చదివితే ఉద్యోగం గ్యారంటీ..

రోజురోజుకూ జియాలజీ కోర్సుకు విస్తృతి పెరుగుతోంది. జియాలజీ కోర్సులు చదివితే ఉద్యోగం గ్యారంటీ అని చెప్పవచ్చు. సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కల్గిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ దఫా నుంచి ఏదైనా సైన్స్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చు. కేయూ క్యాంపస్‌లో 40 సీట్లున్నాయి. క్యాంపస్‌లో హాస్టల్ వసతి ఉంది. అడ్మిషన్లపై విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే నేరుగా కేయూ జియాలజీ విభాగాన్ని సంప్రదించవచ్చు.



- ప్రొఫెసర్ రాగి మల్లికార్జున్‌రెడ్డి
విభాగాధిపతి, జియాలజీ

కేయూ జియాలజీ విభాగం ప్రత్యేకతలు

కేయూ క్యాంపస్‌లో జియాలజీ విభాగం ఉంది. వివిధ ఖనిజాలు, శిలల సముదాయాలతో కూడిన మ్యూజియం నెలకొల్పారు. జీఐఎస్, రిమోట్ సెన్సింగ్ ల్యాబ్, భూగర్భ జలాన్వేషణకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది. జియాలజికల్ సర్వే ఎక్విప్‌మెంట్, అత్యాధునిక రీసెర్చ్ మైక్రోస్కోప్ ల్యాబ్, పెట్రాజికల్, జియో కెమికల్ మోడలింగ్, సాఫ్ట్‌వేర్, భూగర్భ జల నాణ్యత పరీక్షల ల్యాబ్, ఈ-క్లాస్‌రూమ్ బోధన, లైబ్రరీని ఏర్పాటు చేశారు. యేటా జియాలజీ విభాగం విద్యార్థులకు ఫీల్డ్ వర్క్స్, గనుల చమురు క్షేత్రాల సందర్శన, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌తో పాటు అత్యుత్తమ అర్హతలు కల్గిన ప్రొఫెసర్లతో బోధన అందిస్తున్నారు.

కోర్సు ప్రవేశానికి అర్హతలివే..

ఎంఎస్సీ జియాలజీ కోర్సులో అడ్మిషన్లకు ఏదైనా సైన్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే సీపీజీఈటీ-2025 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. సీపీజీఈటీ-2025కి రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://cpget.tgche.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఉద్యోగ అవకాశాలు

జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, నేషనల్ జియోఫికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, ఆయిల్ అండ్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, అటామిక్ మినరల్ డివిజన్, మినరల్ ఎక్స్‌రేషన్ కార్పొరేషన్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కోల్ ఇండియా లిమిటెడ్, నేషనల్ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ కార్పొరేషన్‌లో విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉద్యోగాలు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, రాష్ట్ర భూగర్భ జల శాఖ, డిస్ట్రిక్టు రూరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్‌లోనూ ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటితో పాటు ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో జీఐఎస్ అనలిస్ట్, మల్టీ నేషనల్ మైనింగ్ కంపెనీలు, పర్యావరణ వేత్తలు, భూగర్భజల అన్వేషణ కంపెనీలు, సిమెంట్ పరిశ్రమలు, జాతీయ ఖనిజ అన్వేషణ సంస్థల్లోనూ ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

మేడారంలో కేశఖండనకు రుసుము పెంపు



తాడ్వాయి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థానంలో భక్తుల కేశఖండనకు రుసుము పెంచినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రూ. 10 ఉండగా, ఇప్పుడు రుసుము రూ. 50గా నిర్ణయించినట్టు తెలిపారు. దీనిపై అభ్యంతరాలేమైనా ఉంటే 15 రోజుల్లోగా తమకు తెలపాలని పేర్కొన్నారు.

● తుమ్మచెట్టుపై మర్రి మొక్క!



తుమ్మ చెట్టు కొమ్మపై మర్రి మొక్క పెరగడం ఆసక్తికరంగా మారింది. కేసముద్రం మండలం ఉప్పరపల్లి చెరువు కట్టపైనున్న ఓ తుమ్మ చెట్టుపై మర్రి మొక్క పెరుగుతోంది. పక్షులు మర్రిపండ్లను తీసుకువచ్చి తుమ్మచెట్టుపై తినడంవల్ల గింజలు పడి మర్రిమొక్క ఉద్భవించిందని పలువురు చెబుతున్నారు. అయితే పూర్తిగా చెట్టుపైనే ఆధారపడుతూ మర్రిచెట్టు పెరగడమే ఇక్కడ వింతగా కనిపిస్తోంది. మర్రిచెట్టు పెరిగేందుకు అవసరమైన పోషకాలన్నీ తుమ్మచెట్టు నుంచే అందుతుండడం గమనార్హం. స్వయం పోషకాలుగా పిలవబడే మొక్క భిన్నంగా తన ఎదుగుదలకు మరో చెట్టుపై ఆధారపడి పరాన్నజీవిగా వ్యవహరించడం గమనార్హం.

- కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

● తల్లడిల్లిన తల్లి కోడి



ఏ జీవి అయినా తన బిడ్డకు ఏమైనా జరిగితే తట్టుకోలేదు. ఆ బిడ్డ చనిపోయిందని తెలియక పిల్లను లేపడానికి తల్లి ప్రయత్నం చేస్తుంటుంది. ఇదే తరహాలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని బోయినివాడ వీధిలో మంగళవారం ఉదయం ఓ వీధిలో కోడిపిల్ల చనిపోగా దాన్ని లేపేందుకు తల్లికోడి ప్రయత్నించి, దాదాపు మూడు గంటలపాటు అక్కడే తిరుగుతుండడం పలువురిని చలింపజేసింది. ఏ జాతి అయినా పిల్లల విషయంలో తల్లి ప్రేమ ఒకటేనని ఈ దృశ్యం నిరూపిస్తోంది.

- ఇనుగుర్తి (ఆంధ్రజ్యోతి)

మహిళలకు చదువుచెపుతున్న వాలంటరీ టీచర(పాతచిత్రం)



'ఉల్లాస్'ంగా.. ఉద్యోగావకాశం

- అతివల అక్షరాస్యతకు సదావకాశం
- మహిళా సంఘాల్లోని సభ్యులపై ప్రత్యేక దృష్టి
- చదువుకున్న వారిని టీచర్లుగా ఎంపిక
- ఈ ఏడాది నుంచి రాష్ట్రంలో అమలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే నవభారత్ సాక్షరత కార్యక్రమం ఈ యేడు నుంచి రాష్ట్రంలో అమలు చేసి మహిళా అక్షరాస్యతపై దృష్టి సారించనున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో చదువుకోని మహిళలను గుర్తించి వారు చదువుకునే విధంగా ప్రో త్సహించేందుకు ఈ ఉల్లాస్ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టనున్నాయి. వీరు చదువుకునేందుకు వలంటీర్లనువినియోగిస్తారు. గ్రామీణపేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సహకారంతో వీవోఏలు, స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ బృందాల్లో చదువుకున్న మహిళలను గుర్తించి వలంటీరు టీచర్లుగా ఎంపిక చేస్తారు. ఒక్కొక్కరు 10మంది అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులు వలంటీర్లుగా చేయవచ్చు. అనంతరం తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్)నుంచి 10వ తరగతి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. గతంలో సాక్షారభారత్ కార్యక్రమం 2017తో ముగిసింది. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వాలు అక్షరాస్యతను పెంచే కార్యక్రమాలు చేయలేదు.

నిర్వహణ కమిటీ

గ్రామస్థాయిలో పథకం వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ 16ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందులో డీఆర్‌డీఓతోపాటు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. మండలస్థాయిలో ఎంపీడీఓ, ఎంఈఓ, ఐకేపీ ఏపీఎం, గ్రామస్థాయిలో ఉపాధ్యాయుడు, వీఓ ఏఅధ్యక్షురాలు, కార్యదర్శి బాధ్యతలు చూసుకుంటారు.

ఊతం ఇవ్వనున్న ఈ-డిజిటల్

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) యాప్ ఎట్టకేలకు ప్రజల ముందుకు వచ్చింది. అక్షరాస్యత కార్యక్రమాలకు ఈ-డిజిటల్ ఊతం ఇవ్వనుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఇండియా చొరవలో భాగంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది పెనుమార్పులకు నాంది పలకనుంది. 2027 వరకు ఈ ఉల్లాస్ కార్యక్రమం కొనసాగనుంది.

16 అధ్యాయాల పుస్తకాలు ఉంటాయి

- తెలుగులో చదవడం, రాయడం.
- అంకెలు గుర్తించడం, కూడికలు, తీసివేతలు.
- ఆదాయం పెంచుకునేలా సూచనలు.
- పోషకాహార లోపం, అనారోగ్యాలు.
- అమ్మకు బ్యాంకు ఖాతా.
- ఇరుగు పొరుగుతో మాటామంతీ
- నైపుణ్యాల అభివృద్ధి అంశాలు.
- నిత్యజీవితంలో అవసరమయ్యే ఇతరాలు ఉంటాయి.

ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం..



జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం చేరేలా కార్యచారణ రూపొందిస్తాం. దానికి అనుగుణంగా నిరక్షరాస్యులకు చదువు చెప్పేలా ప్రణాళిక చేస్తాం. విద్యాశాఖ డీఆర్‌డీఓ సంయుక్తంగా పనిచేసి లక్ష్యాన్ని చేరుకుని జిల్లాలో మహిళల అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తాం.

- మేన శ్రీను, హనుమకొండ జిల్లా డీఆర్‌డీఓ

సీఎం ఇన్‌స్టాలో 'కాటారం వరినాట్లు'




రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్‌స్టాగ్రామ్ అఫీషియల్ పేజీలో కాటారం మండలంలో చేపడుతున్న వానాకాలం వరినాట్లు వార్త పెట్టు కోవడం విశేషం. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వానాకాలం వరి నాట్లు షురూ' శీర్షికన ప్రచురితమైన కథనం ఇన్‌స్టాగ్రామ్‌లో 'రేవంత్ అఫీషియల్' పేరిట ఉన్న గ్రూపులో చోటు చేసుకుంది. రేవంత్ అఫీషియల్ గ్రూపును ఫాలో అవుతున్న పలువురు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాట్లు వేస్తున్న పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం చేయడంతో ఇలా సీఎం ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పెట్టుకున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

- కాటారం (ఆంధ్రజ్యోతి)

'శ్రీరామా.. నీ దయ చూపు'

- 77 రామదాసు సంకీర్తనలు ఆంగ్లానువాదం
- పుస్తకంగా ప్రచురించిన ఆథర్స్ ప్రెస్
- ప్రొఫెసర్ రాజగోపాలాచారి రచనాశైలి



ఆచార్య రాజగోపాలాచారి రామదాసు సంకీర్తనల ఆంగ్లానువాదం షొయర్ యువర్ మెర్సీ, ఓ శ్రీరామా! పుస్తకం

హనుమకొండ, జులై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ భక్తుడు రామదాసు (కంచెర్ల గోపన్న) రచించిన 77 సంకీర్తనలను కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్లశాఖ విశ్రాంతాచార్యుడు మాడభూషణం రాజగోపాలాచారి ఇటీవల ఆంగ్లంలోకి అనువదించారు. షవర్ యువర్ మెర్సీ ఓ శ్రీ రామా! అనే శీర్షికతో ఈ పుస్తకాన్ని న్యూఢిల్లీలోని ఆథర్స్ ప్రెస్ పుస్తకంగా ప్రచురించింది. రాజగోపాలాచారి 208 అన్నమయ్య కీర్తనల ఆంగ్లానువాదాన్ని కూడా ఈ ప్రెస్ గతంలో ముద్రించింది. పురాతన సాహిత్యానువాదంలో భాషాపరంగా ఉన్న ఇబ్బందులను సమర్థంగా ఎదుర్కొంటూ, మూలరచన దెబ్బతినకుండా రామదాసు కీర్తనలను అందంగా అనువదించారు. భక్తిసాహిత్యం పట్ల ఆచార్య రాజగోపాచారి మొక్కవోని నిబద్ధతను ఈ గ్రంథం తెలుపుతుంది. ఆచార్య ఈ పుస్తకంలో శ్రీ రామదాసు 77సంకీర్తనలను ఆంగ్ల అనువాదంతో పాటు తెలుగు మూలాన్ని కూడా సమకూర్చారు. వీటితో పాటు ప్రతీ సంకీర్తనకు కఠిన పదాల అర్థాలు, సుబోధకమైన ఆంగ్ల వ్యాఖ్యానం ఇవ్వడం ఇందులో విశేషం. ఆంగ్లం రాని తెలుగు పాఠకులకు కూడా ఇదొక రామదాసు సంకీర్తనల సంకలనంగా చదువుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. గ్లోసరిలో కఠిన పదాలకు ఆంగ్లంతో పాటు తెలుగులో కూడా అర్థాలు ఇవ్వడం వల్ల సంకీర్తనలను అర్థం చేసుకోవడం సులభమైంది. రచయిత ఈ సంకీర్తనలను నాలుగు విభాగాలుగా విభజించడం ఇందులో ప్రత్యేకత. గ్లోరీ ఆఫ్ లార్డ్ శ్రీ రామా అనే మొదటి విభాగంలో మొత్తం 23 సంకీర్తనలు చేర్చారు. ఈ విభాగంలోనే 11 సంకీర్తనలను నామ సంకీర్తన అన్న ఉపవిభాగంలో చేర్చారు. మూడో విభాగపు 18 కీర్తనలలో శ్రీమద్రామానుజుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఎన్‌కౌంటర్ విత్ తానీషా' అన్న చివరి విభాగంలో 'వినరయ్య తానీషాగారు మా మనవి..' అంటూ తన మనవిని రామదాసు విన్నవించిన తీరును ఆంగ్లంలో ఆకట్టుకునే రీతిలో అనువదించారు.

పలు ఆంగ్లానువాదాలు

ఆచార్య రాజగోపాలాచార్య ఇంతకు ముందు పలు ఆంగ్లానువాదాలు చేశారు. అన్నమయ్య కీర్తనలను 'హై ఇన్‌ది స్కై అట్ విష్ణుపాద! అన్నమాచార్య సంకీర్తనాస్' పేరుతో చేసిన ఆంగ్లానువాదం ఇందులో ఒకటి. తిరుమల తిరుపతి వైభవంపై 'ఎటర్నల్ గ్లోరీ ఆఫ్ తిరుమల తిరుపతి ష్రైన్ (టీటీడీ-2024)' పేరుతో పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. తెలంగాణ సాయుధ పోరాటంపై 'తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ - 1948' పేరుతో ఆంగ్లంలో రాసిన మరో పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. డైవర్సిటీ ఇన్ ఇండియన్ లిటరేచర్ ఇన్ ఇంగ్లీష్ రీసెంట్ రిఫ్లెక్షన్స్ (2019), భక్తి మూమెంట్ అండ్ లిటరేచర్ (2016), పోస్ట్ కలోనియల్ ఇండియన్ ఇంగ్లీష్ ఫిక్షన్: డిసెంటరింగ్ ది నేషన్ (2016), మల్టీకల్చరలిజం ఇన్ ఇండియన్ ట్రెడిషన్ అండ్ లిటరేచర్ (2016) వంటి పలు పుస్తకాలు ఆచార్య సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఆచార్య రాజగోపాలాచార్య 2021 నుంచి 2023 వరకు సప్తగిరి (ఇంగ్లీష్) సంపాదక మండలిలో సభ్యుడిగా కూడా ఉన్నారు. శ్రీ వెంకటేశ్వరుడి మహిమలు, తిరుమల వైభవంపై ఇందులో అనేక వ్యాసాలు రాశారు.

సంకీర్తనా సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే..



భక్తిసాహిత్యంలో తనదైనశైలిలో సంకీర్తనలను రచించి విశిష్ట స్థానాన్ని పొందిన కంచెర్ల గోపన్న (1620-1688) భద్రాచల దేవాలయం నిర్మాణం చేసి శ్రీ రామదాసుగా ప్రసిద్ధి చెందాడు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ఆయన కీర్తనలు సంకీర్తనా గోష్ఠులలో, భజనలలో ముఖ్య భూమికను సంతరించుకున్నాయి. 'దాశరథీ కరుణాపయోనిధీ!' అనే మకుటంతో ఆయన రచించిన దాశరథి శతకంలో కనీసం ఒక్క పద్యం రాని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. 'పలుకే బంగారమాయెనా కోదండపాణి..' వంటి కీర్తనలు ప్రజలలో బహుళ ప్రాచుర్యం పొందాయి. సంకీర్తనా సాహిత్య ఔన్నత్యాన్ని తెలుగు రాష్ట్రాల పరిధిదాటి ఇతర రాష్ట్రాల, దేశాల పాఠకులకు పరిచయం చేసే బృహత్తర ప్రయత్నంలో భాగంగా రామదాసు కీర్తనలను ఆంగ్లానువాదం చేశాను.

- ఆచార్య రాజగోపాలాచారి, హనుమకొండ

పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు దాశరథి



చిన్నగూడూరులో దాశరథి జయంతి వేడుకలో మాట్లాడుతున్న రాంరెడ్డి

చిన్నగూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సాహిత్యంతో సమరం చేస్తూ, నాటి రైతాంగంలో రాచరికానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు దాశరథి అని మరిపెడ మాజీ పీఏసీఎస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు రావుల రాంరెడ్డి కొనియాడారు. మంగళవారం మండలంలోని దాశరథి ప్రాంగణంలో కృష్ణమాచార్యుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కళా బృందం, దాశరథి కళాబృందంలు దాశరథి రాసిన గీతాలు ఆలపించి, వారందించిన స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్, ఉద్యమకారుడు సోమన్న మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంపత్, ఎంపీడీవో యాకయ్య, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, సందీప్, దొంగరి నర్సయ్య, శంకరయ్య, సీపీఐ నాయకులు మోహన్, బీఆర్ఎస్ నాయకులు వెంకట్, శ్యామ్, నరేశ్, లింగన్న, జాగృతి జిల్లా యూత్ అధ్యక్షుడు వేణు, నటుడు రాజమౌళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● కురవి : దాశరథి కృష్ణమాచార్య నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడా రని హెచ్ఎం వెంకన్న అన్నారు. కురవి మండలం సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్, ఎండి.అంజాద్‌పాషా, కె.సారంగం, బి.సరోజ, వి.శుభ, ప్రగతి, బాలరాజు పాల్గొన్నారు.

● కేసముద్రం : కేసముద్రం విలేజి శ్రీ వివేకవర్ధిని, కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం దాశరథి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, హెచ్ఎం బండారు నరేందర్‌లు దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

● జిల్లా కేంద్రంలోని మహోదయ పాఠశాలలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాఠశాలలో కృష్ణమాచార్యుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగయ్య, ఉపాధ్యాయులు రవీందర్, కనకయ్య, సచిన్, భాగ్య, స్పందన తదితరులు పాల్గొన్నారు.

● నెల్లికుదురు : మండలంలోని రామన్నగూడెం యూపీఎస్ పాఠశాలలో మంగళవారం ధాశరధి కృష్ణమాచార్యుల జయంతి నిర్వహించారు ధాశరది చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. దాశరథి కవితలను చదివి వినిపించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సోమయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కేసముద్రం వివేకవర్ధిని పాఠశాలలో..

ప్రజా ఉద్యమాలకు కేంద్ర బిందువు హన్మంతు



సంతాపసభలో మాట్లాడుతున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మానుకోట ప్రాంతంలో అర్ధశతాబ్ద కాలంపాటు ప్రజా ఉద్యమాలకు తెలంగాణ పోరాట యోధుడు గుంజె హన్మంతు కేంద్ర బిందువుగా నిలిచారని తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్ డాక్టర్ డోలి సత్యనారాయణ, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుడు దివంగత గుంజె హన్మంతు సంతాప సభను మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ తరపున ఆపార్టీ నేతలు గుంజె హన్మంతు కుటుంబానికి రూ.22,500 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల వీరయ్య, గోవర్ధన్, మార్నేని రఘు, ఎస్కే. మహబూబ్‌పాషా, పొల్‌రాజు, రాందాసు, రాంచంద్రు, ఈ. ఉప్పలయ్య, బూద్యనాయక్, బాలరాజు, దర్శనం రామకృష్ణ, బోడ లక్ష్మన్, బోనగిరి మధు, పాపయ్య, బట్టు చైతన్య, చాగంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రభాకర్



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా కేంద్రానికి చెందిన చాగంటి ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు టి. సత్యనారాయణ, పి. అంజయ్య మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రభాకర్ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా క్రియాశీలక పాత్ర పోషిస్తూ సంఘం అభివృద్ధితో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేశారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర జిల్లా నాయకులకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

రామాలయంలో గోరింటాకు వేడుక



గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

బయ్యారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల ంలోని రామాలయం వేదికగా పలువురు మహిళలు గోరింటా వేడుకను మంగళవారం నిర్వహించారు. రోటిలో గోరింటాకు నూరి ఎర్రగా పండేలా చేతులకు అలంకరించుకున్నారు. అంతకు ము ందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తు త తరుణంలో ప్రతి ఫంక్షన్‌కు ముందు మెహెందీ వేడుక జరుపుకోవడం పరిపాటిగా మారింది.

తెలంగాణ వాటాను కాపాడుకోవాలి

కురవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో తెలంగాణ వాటను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు గుగులోత్ రవినాయక్ అన్నారు. కురవి మండలం నేరడలోని కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూళ్లలో విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై అవగాహన కల్పించారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌కు 200 టీఎంసీల నీరు అదనంగా వెళ్తుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం బీఆర్ఎస్ పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తీసుకువచ్చిందని బనకచర్ల ప్రాజెక్ట ద్వార తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. బండి దీపక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూకల అనిల్, బాదావత్ సురేష్, జక్కుల సందీప్ పాల్గొన్నారు.

కొండంత చేశాం..
గోరంత చెప్పుకోలేక పోతున్నాం : పొంగులేటి

మహబూబాబాద్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధా న్యత నిస్తూ ఏడాదిన్నర కాలంలో అనేక పథకాలను అమలు చేస్తున్నప్పటికీ వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లలేక పోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం నుంచి సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక, సీఎం పీఆర్వో జి. మల్సూర్‌తో కలిసి మంగళవారం జిల్లా సమా చార పౌరసంబంధాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో ఎంతో అభివృద్ధి చేసినప్పటికీ ఆశించిన రీతితో ప్రజలకు వివరించలేక పోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలో ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్ స్థానంలో తెలంగాణ అగ్రపథంలో నిలిచిందన్నారు. ఇవే కాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు సన్నబియ్యం, రైతు భరోసా పెంపు, రుణమాఫీ, ఇంటి గ్రేటెడ్ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ ఇలా రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో పెద్ద పీఠ వేశామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో చేసి చూపించామన్నారు. కొత్తగా 7 లక్షల రేషన్‌కార్డులు, 15 లక్షల మంది పేర్లు రేషన్‌కార్డుల్లో నమోదు చేశామని తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



సౌండ్ బాక్స్‌లు, టై బెల్టులు అందజేస్తున్న రాజేష్‌నాయక్

తొర్రూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. మంగళవారం తొర్రూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు పెద్దనాన్న ఫౌండేషన్ చైర్మన్, తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్ రూ.10వేల విలువగల సౌండ్ బాక్స్‌లను, డీఎస్‌టీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు టై, బెల్టులను ఎంఈవో బుచ్చయ్య చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో తొర్రూరు మాజీ సర్పంచ్ దరావత్ రాజేష్ నాయక్, చైతన్య, ప్రేమ్ చందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సునీత, ఫిరోజ, శిరీష తదితరులు ఉన్నారు.

మండలానికి 60 టన్నుల యూరియా

గూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలానికి 60 టన్నుల యూరియాను కేటాయించి సరఫరా చేసినట్లు జిల్లా ఇంచార్జ్ వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాస్ తెలిపారు. గూడూరు సొసైటీ గోదాంలో ఉన్న యూరియా బస్తాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూడూరు, అప్పరాజుపల్లిల సొసైటీల ఆధ్వర్యంలో 60 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు చెప్పారు. రోజువారీగా ఆయాకేంద్రాలకు యూరియా వస్తుందన్నారు. రైతులు ఎవరు ఆందోళనచెందవద్దని, కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. అందరికి అందుబాటులో యూరియా ఉంటుందని చెప్పారు. మోతాదుకు మించి యూరియాను వాడవద్దని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

గార్ల జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతీఒక్కరు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబం ఆనందంగా జీవించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వరంగల్ ఏజీఎం సత్యకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వర్తక సంఘం భవనంలో ఇన్సూరెన్స్ బీమా పథకాలపై ఖాతాదారులకు అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈసందర్భంగా గార్ల బ్రాంచ్ పరిధిలో ఇన్సూరెన్‌పాలసీ పొంది ఇటీవల ప్రమాదవ శాత్తు మృతి చెందిన కట్టెబోయిన వెంకటరత్నం, తండ్రి కట్టెబోయిన భిక్షమయ్యకు సంస్థ రూ.20 లక్షల బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో యాకోబ్ నాయక్, రాజు నాయక్, శోభన్, రంజిత్, మంజుల పాల్గొన్నారు.

వనమహోత్సవంలో భాగస్వాములు కావాలి



వన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ మండలం బోడగుట్టతండాలో మంగళవారం మొక్కలు నీరు పోశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా యూత్ అధ్యక్షులు అజ్మీర సురేష్‌నాయక్, బానోత్ సుందర్, భూక్య వీరన్న, అజ్మీర కిషన్, భూక్య నవీన్, వాంకుడోతు లింగ్యా, భూక్య నరేష్, అజ్మీర శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మించాలి



పాకాల ఏటిపై నిరసన తెలుపుతున్న సత్యవతి

గార్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాల సమయంలో ప్రజల ప్రాణాలకు పెనుముప్పుగా మారిన పాకాల ఏటిపై రాంపురం సమీపంలో బ్రిడ్జి నిర్మించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు. మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ నిర్మాణ ప్రదేశంలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి, నవీన్, నాగరాజు, అలవాల రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాన్ని జయప్రదం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిర్వహించే దశల వారీ పోరాటాలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు సామ మల్లారెడ్డి, సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. మహబూబాద్‌లోని టీపీటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకూబ్, బలాష్టి రమేష్, దేవేందర్‌రాజు, ఆరుద్ర వెంకటేశ్వర్లు, సంజీవ, రమేష్, రామలింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ విద్యాలయ తనిఖీ

నర్సింహులపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఎంపీడీవో రాధిక మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెను ప్రకారం భోజనం అందించాలని, విద్యాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి చెప్పారు. పదో తరగతి విద్యార్థినిలు ఇప్పటినుంచి చదువులో రాణించాలని తెలిపారు

మృతురాలి కుటుంబానికి పరామర్శ

నెల్లికుదురు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచికల్ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్త సీత భవాణి(40) అనారోగ్యంతో మృతి చెందడంతోమంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పరామర్శించారు. ఎదళ్లయాదవరెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, ఇట్టె దేవేందర్‌రెడ్డి, గుగులోత్ బాలాజీనాయక్, ఆకుతోట సతీష్, పాల్గొన్నారు.

జీవో 282ను రద్దు చేయాలి

మరిపెడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల పని గంటలను పెంచేందుకు జారీచేసిన జీవో 282ను రద్దుచేయాలని టీయూసీఐ జిల్లా నేత రాంలాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ మునిసిపల్ కార్మికుల సమావేశం మునిసిపల్ ఆఫీస్‌లో జరుగగా ఆయన హాజరై 31న వామపక్ష కార్మిక సంఘాలు చేపడుతున్న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ అందుకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆ యూనియన్ నాయకులు ఉపేందర్, శివాజీ, కృష్ణ, వెంకన్న, మోతిలాల్, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీరోలు ఎస్సైగా సంతోష్



కురవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సీరోలు ఎస్సైగా గండ్ర సంతోష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎస్సైగా పనిచేసిన నగేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సంతోష్‌కు పోస్టింగ్ ఇచ్చారు. సంతోష్ గతంలో చిన్నగూడూరు, మరిపెడ పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైగా విధులు నిర్వహించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

కేసముద్రం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేసముద్రంలో మంగళవారం మోడెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో తొలుత కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతనందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాదుల శ్రీనివాస్ మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆకుల రాజు, మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, జల్లె జయరాజ్, కావటి నర్సయ్య, వేల్పుగొండ సావిత్ర, జాటోత్ వెంకన్న పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీసేందుకు డ్రాయింగ్ పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు కామిక్ డ్రాయింగ్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి కామిక్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినీ ఎస్. సుదీక్ష ప్రథమ స్థానం, నెల్లికుదురు మండలం మునీగలవీడు జిల్లా పరిషత్ పాఠశాల 10వ తరగతి విద్యార్థి ఆనంద్ ద్వితీయ స్థానం, మానుకోట కేజీబీవీ 10వ తరగతి విద్యార్థినీ వెన్నెల తృతీయస్థానం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి. అప్పారావు, హెచ్ఎం సిరిచ డ్రాయింగ్ ఉపాధ్యాయులు రాజేష్, నారాయణ, ప్రభాకర్, అంబరీష పాల్గొన్నారు.

పీఎస్బీ వినియోగంతో పెట్టుబడి ఆదా

చిన్నగూడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసే పంట భూమిలో ఫాస్పరస్ సాల్యులైజింగ్ బ్యాక్టీరియా(పీఎస్బీ) వినియోగంతో నేలలో ఉన్న భాస్వరం నిల్వలు కరిగించడంతో పాటు రైతులు పంట పెట్టుబడి ఆదా చేయవచ్చని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ సూచించారు. మంగళవారం ఉగ్గంపల్లి రైతు వేదికలో పలువురు రైతులకు (పీఎస్బీ) ఎరువులు పంపిణీ చేసి, మాట్లాడారు. పీఎస్బీ ఎరువు కావాల్సిన రైతులు 1కేజీ కి రూ.20చొప్పున ఉగ్గంపల్లి రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏఈవో శిరీష రైతులు ఉన్నారు.

ఈ నెల 29న మసీదు నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమా మసీదు నూతన కమిటీని ఎన్నుకునేందుకు మంగళవారం ముస్లింలు ప్రత్యేక సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీ ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తైనా ఎన్నికలు నిర్వహించడం లేదని, మసీదు నిబంధనల మేరకు ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి నూతన కమిటీని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు నిబంధన మేరకు ఈ నెల 29న మరోసారి సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మసీద్ ప్రస్తుత అధ్యక్షుడు ఎమ్డీ.అలీమ్, యాకూబ్ పాషా, మహ్మద్ అమీర్, రహమాన్, షాబీర్, గఫార్, సాలార్, సలీమ్, ఇస్లాం, ఎజాస్, గుంశావలి ఉన్నారు.

జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న జాటోత్ హుస్సేన్

గూడూరు,జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గూడూ రు మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాది భూక్య సురేష్‌నాయక్, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, మాజీ సర్పంచ్‌లు వాంకుడోతు మోతీలాల్, భూక్య వెంకన్న, నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండలం మచ్చర్ల శివారు తార్యతండాలో మంగళ వారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు హుస్సేన్‌నాయక్ సానుకూలంగాస్పందించినట్లు వారు తెలిపారు.

నేడు కొత్తగూడలో మంత్రి సీతక్క పర్యటన

కొత్తగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నేడు కొత్తగూడలో పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య తెలిపారు. ఈసందర్భంగా సారయ్య మాట్లాడుతూ కొత్తగూడ రైతువేదికలో లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను మంత్రి సీతక్క పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీతక్క పాల్గొనన్నుట్టు పేర్కొన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బాలుడికి డెంగీ నిర్ధారణ

మహబూబాబాద్ క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన దుంప సిద్ధూ అనే ఏడేళ్ల బాలుడికి డెంగీ వ్యాధి నిర్ధారణ కావడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం కాలనీలో సందర్శించి పరిశరాల పరిశుభ్రత, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు. పలువురు జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోవాలి

దంతాలపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో (ఎస్‌బీఐ) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను ఏర్పాటు చేయాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో బీజేపీ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను కలిసి మండల కేంద్రంలో ఎస్బీఐ శాఖను ఏర్పాటు చేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని వినతి పత్రంలో కోరారు. గతంలో పెద్దముప్పారంలో ఎస్‌బీఐ శాఖ ద్వారా తమకు సేవలు అందాయన్నారు. అక్కడి నుంచి తరలించి తొర్రూరు కేంద్రంలో ఏర్పాటు చేశారన్నారు. తిరిగి తమ పరిధిలో ఉన్న గత బ్యాంకును దంతాలపల్లి మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో హుస్సేన్ నాయక్ స్పందిస్తూ బ్యాంకు సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జనవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

తొర్రూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్తూర్ గ్రామంలో జనవికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారి నరేష్ బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది రాము, శ్రీకాంత్, యాకయ్య, కో-ఆర్డినేటర్ శోభారాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడాలి

దంతాలపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వైద్యాధికారి కవిత ఏఎన్ఎంలను సూచించారు. ఆయా ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.వర్షాకాలంలో ప్రజలు నీటిని వేడి చేసి చల్లారిన తరువాత తాగాలన్నారు. తాగునీటితో పాటు వేడివేడి ఆహారం, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కురవి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం అయ్యగారిపల్లి వద్ద జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో కూలీగా పనిచేస్తున్న చిన్న కొండబాబు జూలై 6వ తేదీ నుంచి కనిపించడం లేదని ఏఎస్సై వెంకన్న తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈస్ట్‌గోదావరిజిల్లా రాఘవేంద్రపురం గ్రామానికి చెందిన కొండబాబు గత కొంతకాలంగా గ్రీన్‌ఫీల్డ్ హైవేలో పనులు చేస్తున్నాడని వెల్లడించారు. ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడని, కానీ అతను ఇంటికి చేరుకోలేదని, అతని బావ సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్య

బయ్యారం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మనస్థాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు బయ్యారం ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బయ్యారం మండలం బోటితండాకు చెందిన బాదవత్ దస్మా (70) అనే గిరిజన వృద్ధురాలు కొద్ది నెలలుగా కడుపునొప్పితో బాధపడుతుంది. మందులు వాడుతున్నప్పటికీ వ్యాధి తగ్గకపోవడంతో మనస్థాపానికి గురైన దస్మా పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు దస్మాను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న దస్మా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

చలో ఢిల్లీకి తరలిరావాలి

మహబూబాబాద్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీల్లో బలహీనవర్గాల (బీసీ)లకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23,24 తేదీల్లో చేపట్టిన చలో డిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని ఆ సంఘంరాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. మురళీధరస్వామి, జిల్లా అధ్యక్షుడు బండారు వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో డిల్లీలో ప్రధానమంత్రితో పాటు అన్ని రాజకీయ పార్టీల పెద్దలను కలిసి చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్‌ను కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి మంగళవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను యుఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థులకు రూ. 20 లక్షల రూపాయల స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలని, విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు వెబ్‌సైట్ www.telangana.epass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవానిఇ సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కొత్తగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి, సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రోజారాణి సూచించారు. కొత్తగూడలోని ఐటీడీఏ సెల్ఫ్ మేనేజ్‌మెంట్ హస్టల్(ఎస్ఎంహెచ్)ను ఎంపీడీవో రోజారాణి మంగళవారం పరిశీలించారు. హస్టల్ ప్రాంగణాన్ని, వంటగదిని పరిశీలించారు. హస్టల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రామకృష్ణ, వార్డెన్ కర్ణాకర్, పంచాయతీ కార్యాదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.